నిర్లక్ష్యం..నిరుపయోగం

- మూలకు చేరిన మున్సిపల్ కాంప్లెక్స్ అద్దెషాపులు
- ఏడాదికాలంగా అద్దెకునోచుకోని వైనం
- పడిపోయిన మున్సిపల్ ఆదాయం



పాత ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఖాళీగా మున్సిపల్ కార్యాలయ అద్దెషాపులు

రాజాం: మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, సరైన నిర్ణయాలు తీసుకోకపోవడం, పాలకమండలి లేకపోవడం రాజాం మున్సిపాలిటీకి శాపంగా మారిం ది. మున్సిపల్ కార్యాలయ అధికారుల తీరు వల్ల పట్టణవాసులు అవస్థలు పడుతుండగా, ఇటు మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి సైతం గండిపడింది. మున్సిపల్ కమిషనర్ కేవలం కార్యాలయానికే పరిమితం కావడం, మిగిలిన అధికారులంతా వచ్చివెళుతున్నామా అన్న చందంగా విధులకు హాజరవుతుండడంతో మున్సిపల్ వ్యవస్థ అధోగతిలో కొట్టుమిట్టాడు తోంది. అభివృద్ధి లేక అవస్థలు పడుతోంది. గతంలో ఉన్న ఆదాయ వనరులన్నీ ఒక్కొక్కటిగా కనుమరుగవుతున్నాయి.

ప్రత్యామ్నాయ మార్గాలను ఆలోచించని అధికారులు

రాజాంలో నవదుర్గామాత ఆలయం వద్ద ఎనిమిదెకరాల విస్తీర్ణంలో మున్సిపాలిటీకి చెందిన భారీ షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. మొత్తం 18 దుకాణాలతో రెండు షాపింగ్ మాల్‌లు ఇక్కడ గతంలో ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆర్టీసీ బస్టాండ్ ఉన్నంతవరకు షాపులు కిటకిటలాడేవి. మున్సిపాలిటీకి భారీగా అద్దెలు వచ్చేవి. కొత్త ఆర్టీసీ కాంప్లెక్స్ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఈ మున్సిపల్ షాపింగ్ మాల్ ప్రాంతం మొత్తం వెలవెలబోతుంది. ఇక్కడ అద్దె షాపుల్లో ఎవరూ ఉండడంలేదు. ఆర్టీసీ కాంప్లెక్స్ మారిన తర్వాత ఇక్కడ దుకాణాలకు అద్దెలు తగ్గించడం, ప్రత్యామ్నాయ ఆదాయ వనరులకు కాంప్లెక్స్ భవనాలను వినియోగించేలా చేయడంలో అధికారులు విఫలమయ్యారు. టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ లేక షాపులన్నీ శిథిలావస్థ కు చేరాయి. భవనాల శ్లాబ్‌లు పెచ్చులూడి వర్షానికి నీరు చిమ్ముతున్నాయి. దీంతో ఇక్కడ వ్యాపార కార్యకలాపాలు సాగించేందుకు ఎవరూ రావడం లేదు. ఈ షాపులకు వేలం వేయడం, ఆధునీకీకరణ పనులను అధికారులు చేయడంలేదు. మొత్తం ఖాళీ స్థలాన్ని మార్నింగ్ మార్కెట్‌గా మార్చేయడంతో వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతోంది. వీటికి తోడు ప్రైవేటు వాహనాలు ఇక్కడ పార్కింగ్ ప్రారంభించాయి. ఈకారణాలతో షాపింగ్‌మాల్ మొత్తం మూతపడే పరిస్థితి ఏర్పడింది. గతంలో ఈషాపులు ద్వారా నెలకు రూ. 1.80 లక్షల మేర ఆదాయం లభించేది. ఇప్పుడు చిల్లిగవ్వ రావడం లేదు.

పంచాయతీ కంటే దారుణం..

పట్టణంలో కొత్త నిర్మాణాలు ప్లానింగ్‌లు, లేఅవుట్‌ల అనుమతులు తదితర అంశాల విషయంలో టీపీఓ, మేనేజర్‌తో పాటు అధికారుల ప్రమేయాలు ఉండడం, అక్రమ అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పెండింగ్‌లో ఉన్న కోట్ల రూపాయల ఇంటి పన్ను వసూలు చేయడం అధికారులకు కొరకరానికొయ్యగా మారింది. మున్సిపల్ ఆస్తులు ద్వారా వచ్చే ఆదాయాన్ని కోల్పోవడం, వాటికి ప్రత్యామ్నాయ పద్ధతులు పాటించక పోవడం పెద్ద సమస్యగా మారింది. ఇటు మున్సిపల్ అభివృద్ధి లేక, అటు కొత్త పనులు, వసతులు కల్పనలేక, ఆదాయం లేక ఇప్పుడు రాజాం మున్సిపాలిటీ పంచాయతీ వ్యవస్థ కంటే దారుణంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

దృష్టిసారించాం



రాజాం మున్సిపాలిటీకి సంబంధించి షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఖాళీ స్థలాలు ఉన్నాయి. వీటిని అద్దెకు తీసుకునేందుకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. పాత ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు మాధవబజార్‌లో ఇదే పరిస్థితి ఉంది. మున్సిపల్ పరిధిలో ఆదాయం తగ్గడంతో అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతోంది. వీటిని గాడిలో పెట్టేందుకు దృష్టిపెడుతున్నాం.

– జె.రామప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్, రాజాం.

వైజ్ఞానిక దృక్పథంతో నూతన ఆవిష్కరణలు


సెమినార్‌లో ప్రసంగిస్తున్న జేవీవీ ప్రతినిధులు

బొబ్బిలి: విద్యారంగంలో వైజ్ఞానిక దృక్పథంతో కొత్త ఆవిష్కరణలు సాధ్యపడతాయని వక్తలు అన్నారు. గురువారం స్థానిక ట్రిపుల్‌ఎస్ డిగ్రీ కాలేజీలో 'వైజ్ఞానిక దృక్పథం-విద్యార్థుల పాత్ర' అన్న అంశంపై జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో గురువారం సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులకు శాస్త్రీయ అంశాలపై అవగాహన కల్పించారు. జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.శివానంద్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, తదితరులు మాట్లాడుతూ మూఢనమ్మకాలను విడనాడే విధంగా విద్యార్థులు శాస్త్రీయత కలిగి ఉండాలన్నారు. ఈనెల 13 నుంచి రెండు రోజుల పాటు జిల్లా కేంద్రంలో జరిగే జేవీవీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జాతీయస్థాయి పోటీలకు జీఎంఆర్ విద్యార్థులు


విశాఖలో నిర్వహించిన పోటీల్లో నగదు బహుమతి అందుకుంటున్న జీఎంఆర్ ఐటీ విద్యార్థులు

రాజాం సిటీ: త్వరలో అమరావతిలో జరగనున్న జాతీయస్థాయి హ్యాక్‌థాన్-2025 పోటీలకు స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ సి.ఎల్. వి.ఆర్.ఎస్.వి.ప్రసాద్ గురువారం తెలిపారు. ఈనెల 10న విశాఖపట్నం గాయత్రీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన సెమీఫైనల్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు చక్కని ప్రదర్శన కనబరిచారని చెప్పారు. క్యూబిట్-ట్రేసర్ అనే ప్రాజెక్టుకు నిర్వాహకులు రూ. 10 వేల నగదు బహుమతి అందించారని, అలాగే మరో జట్టు కూడా ఎంపికైందని తెలిపారు.వీరంతా త్వరలో జరగనున్న జాతీయస్థాయి క్వాంటమ్ హ్యాక్‌థాన్ పోటీలో పాల్గొంటారని చెప్పారు.

సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శిగా జగదీశ్వరరావు


బెవర జగదీశ్వరరావు

వంగర: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా వింగ్ రాష్ట్ర కార్యదర్శిగా బెవర జగదీశ్వరరావు నియమితులయ్యారు.ఈ మేరకు పార్టీ అధిష్టానం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. మండలం లోని కొండచాకరాపల్లి గ్రామానికి చెందిన జగదీశ్వరరావు గతంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఐటీ విభాగం కార్యదర్శిగా పని చేశారు. జగదీశ్వరరావుకు ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, జెడ్పీటీసీ కరణం రాధమ్మ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు తదితరులు అభినందనలు తెలిపారు.

గతేడాదితో కలిపి వాహనమిత్ర అందించాలి


మాట్లాడుతున్న ఆటో యూనియన్ నాయకులు

రాజాం సిటీ: కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వాహన మిత్ర పథకం కింద గతేడాది, ఈ ఏడాది కలిపి ఆటో డ్రైవర్లకు రెండేళ్లకు సంబంధించి ఆర్థిక సహాయం అందించాలని ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కోటి, నారాయణరావు డిమాండ్ చేశారు. రాజాంలో గురువారం ఆటో యూనియన్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహన మిత్ర పథకం ప్రకటించినప్పటికీ ఆటో వర్కర్స్‌లో ఏ ఒక్కరికి సంతృప్తిగా లేదని అన్నారు. ఆటో కార్మికుల జీవనవిధానంలో తీవ్రమైన మార్పులు చోటుచేసుకున్నాయని, ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. ఆటో కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు సీహెచ్.రామ్మూర్తినాయుడు, నాయకులు రాము, సూర్యారావు, పాపారావు, సురేష్, జగదీష్, శ్రీను, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'అకడమిక్ క్యాలెండర్ పాటించాలి'



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు జోగినాయుడు

రామభద్రపురం: ప్రైవేటు విద్యా సంస్థలు కూడా ప్రభుత్వ విద్యా సంస్థల మాదిరిగా అకడమిక్ క్యాలెండర్‌ను తూచా తప్పకుండా పాటించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ ఉమ్మడి విజయనగరం జిల్లా గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా తల్లికి వందనం లాంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నందున, ఆ పాఠశాలలు కూడా అకడమిక్ క్యాలెండర్ పాటించేలా చూడాలన్నారు.ప్రైవేట్,కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు ఉపాధ్యాయులకు జీతాల చెల్లింపుల్లో, ప్రభుత్వం నిర్దేశించిన సిలబస్‌ను బోధించడంలో,ఫీజుల వసూళ్లలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అయినా సంబంధిత మంత్రులు, విద్యాశాఖాధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులను మాత్రం తీవ్రంగా కించపరుస్తూ ,ఆచరణాత్మకం కాని కార్యక్రమాలను వారి నెత్తిన రుద్దుతున్నారని మండిపడ్డారు.

చేతకాకే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ

- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి


మాట్లాడుతున్న శంబంగి, తదితరులు

బొబ్బిలి: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించేందుకు సిద్ధమవడం సీఎం చంద్రబాబునాయుడి చేతగానితనానికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 40 ఇయర్స్ ఇండస్ట్రీ అనీ, 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేశానని, దేశంలో ప్రధానమంత్రులు, రాష్ట్ర పతులను నియమించింది తానేనని చెప్పుకుంటున్న సీఎం చంద్రబాబు ఇన్నేళ్లలో రాష్ట్రానికి ఒక్క మెడికల్ కాలేజ్ కూడా తేలేదన్న విషయం అందరికీ తెల్సిందేనన్నారు. మొదటిసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి 17 ప్రభుత్వ వైద్య కళాశాలలు తెచ్చి అందులో సగం ప్రారంభించారని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నప్పటికీ వాటిని నిర్వహించలేమని కూటమి ప్రభుత్వం చేతులెత్తేసి అమ్మకానికి పెట్టడం ఎంత వరకూ సబబన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉంటే రాష్ట్రంలోని విద్యార్థులు ఇతర రాష్ట్రాలు, దేశాలు వెళ్లి వైద్య విద్యను అభ్యసించనక్కరలేదన్నారు. అలాగే వైద్యం కూడా ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగిస్తే వైద్య విద్య చదవాలనుకునే పేద,మధ్యతరగతి విద్యార్థుల గతేం కావాలని ప్రశ్నించారు. కొత్తవి అదనంగా తేవాల్సిన ముఖ్యమంత్రి ఇలా ఉన్న వాటిని ప్రైవేటీకరించడం ఎంతవరకు సబబని అన్నారు. జగన్ ప్రభుత్వంలో జిల్లా కేంద్రంలోని కొండకరకాం సమీపంలో నిర్మించిన మెడికల్ కళాశాల భవనాలు పెద్దకోటను తలపిస్తున్నాయని, అటువంటి నిర్మాణాలు చంద్రబాబు హయాంలో ఎప్పుడైనా చేశారా అని ప్రశ్నించారు. అదేవిధంగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను దశల వారీగా ప్రైవేటీకరిస్తుంటే చూస్తూ ఊరుకోవడం చంద్రబాబు అసమర్థతకు పరాకాష్ట అని అన్నారు. ఈ అమ్మకాలు, ప్రైవేటీకరణలో చంద్రబాబుకు ఏమైనా వాటాలు ఉన్నాయేమోనని అనుమానాన్ని వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు మాట్లాడుతూ ఓవర్ యాక్షన్ స్టార్ పవన్ కల్యాణ్ కూటమితో జత కట్టక ముందు స్టీల్ ప్లాంట్ ఎవడబ్బ సొత్తు?, ఎలా ప్రైవేటీకరిస్తారని ఊగిపోయి బీరాలు పలికారని, ఇప్పుడు కిమ్మనకుండా కేంద్రం చర్యలన్నింటికీ బఫూన్‌లా తలూపు తున్నారని ఘాటుగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నీ కత్తిరింపులు, ప్రైవేటీకరణలేన్నారు. కేంద్రం చెప్పినదానికి తలొగ్గడమే తప్ప వీరు సొంతంగా చేసేదేమీ లేదన్నారు. ఇప్పుడు మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించినప్పటికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నింటినీ తిరిగి ప్రభుత్వంలో కలుపుతామని స్పష్టం చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.వి.మురళీ కృష్ణారావు, బాడంగి మండల వైఎస్సార్‌సీపీ కార్యదర్శి తెర్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై రణభేరి


రణభేరి వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

బొబ్బిలిరూరల్: విద్యారంగ సమస్యలపై ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు చేపట్టనున్న విద్యారంగ పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు విజయగౌరి కోరారు. మండలంలోని పిరిడి ఉన్నత పాఠశాలలో రణభేరి వాల్ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు.ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని, ఒత్తిడి లేని పని విధానం తేవాలని,ఉమ్మడి సర్వీసు రూల్స్‌ద్వారా ప్రమోషన్లు కల్పించాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని విజయగౌరి డిమాండ్ చేశారు. యూటీఎఫ్ నాయకులు స్వామినాయుడు, రమేష్,బత్తుల శ్రీనివాస్,లావణ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

రేగిడి: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపుమేరకు వారం రోజుల పాటు ఉపాధ్యాయులు నిరసన తెలపనున్నారని ఆ శాఖ మండల అధ్యక్షుడు వావిలపల్లి తారకేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి శెట్టి శివరావు, జిల్లా ఉపాధ్యక్షుడు మురపాక వెంకటరమణ, జిల్లా కార్యదర్శి యందువ సీతంనాయుడు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మీసాల సత్యంనాయుడు, యందువ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు సరిదిద్దండి


మాట్లాడుతున్న శంకరరావు, తదితరులు

బొబ్బిలి: గత ప్రభుత్వం భూరీసర్వే చేసి ఇచ్చిన పట్టదారు పాస్‌పుస్తకాల్లో తప్పులున్నాయని కూటమి నాయకులు గతంలో ఎన్నో ఆరోపణలు చేశారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఇస్తున్న పాస్ పుస్తకాల్లోనూ తప్పులు ఉన్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు ఆరోపించారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్ పుస్తకాల్లో అసలు భూమికి సంబంధం లేని, ఆ ఊర్లో లేని వ్యక్తుల పేర్లు ముద్రించి ఉండడంతో రైతులు నిశ్చేష్టులవుతున్నారన్నారు. ఉదాహరణకు రామభద్రపురం మేజర్ పంచాయతీలో చింతల రామలింగేశ్వరరావు పేరున ఉండాల్సిన సర్వే నెంబర్లు ఆ ఊరికి సంబంధం లేని పెద్దపల్లి జగన్ పేరున ఉండడం దారుణమన్నారు. ఈ సమస్య కేవలం ఈ గ్రామంలోనే కాకుండా నియోజకవర్గంలోని వీరసాగరం,భీమవరం, అలజంగి,కారాడ,నారశింహునిపేట,ఆరికతోట కూనాయవలస తదితర గ్రామాల్లోనూ ఉందన్నారు. తప్పులు సరిదిద్దాలని రైతులు తహసీల్దార్,సచివాలయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, కానీ రెవెన్యూ అధికారులు మాత్రం మాకు ఇంకా ఆప్షన్ ఇవ్వలేదని సమాధానం చెబుతున్నారన్నారు. ఇదేఅదనుగా రైతులతో రెవెన్యూ సిబ్బంది బేరసారాలాడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనేస్పందించి గ్రామాల్లోక మిటీలు వేసి పాస్‌పుస్తకాల్లో తప్పులను సరిదిద్దేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమస్యపై ఈనెల 15న ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేయనున్నట్టు చెప్పారు.ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం,జిల్లా కమిటీ సభ్యుడు ఉడమల ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించండి


తెర్లాం:నందబలగలో మాట్లాడుతున్న రామభద్రపురం హెచ్‌ఓ మోహన్‌కృష్ణ


బొబ్బిలిరూరల్: అలజంగిలో అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఓ వెంకటరత్నం

తెర్లాం/వంగర/ బొబ్బిలిరూరల్: ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని ఉద్యానవనశాఖ అధికారులు పి.మోహన్‌కృష్ణ, సీహెచ్. ఉమామహేశ్వరి, ఎస్.వెంకటరత్నం రైతులకు సూచించారు. తెర్లాం మండలంలోని నందబలగ, వంగర మండలంలోని మరువాడ, బొబ్బిలి మండలంలోని అలజంగి గ్రామంలోఉద్యానవనశాఖ, వివిధ ఆయిల్ పామ్ కంపెనీల ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్‌సాగుపై గురువారం అవగాహ న సదస్సులు నిర్వహించారు. హెచ్‌ఓలు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ఈ పంట సాగుచేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందజేస్తుందని చెప్పారు. ఈ పంటలో అంతర పంటలు సాగుచేసుకో వచ్చని,తద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని అన్నారు. ఈ పంట సాగుచేసేందుకు ఆసక్తి కనబరుస్తూ ముందుకు వచ్చిన రైతుల వివరాలను హెచ్‌ఓలు నమోదు చేసుకున్నారు.గోపాలకృష్ణ ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజర్ వీరబాబు, శ్రీశ్రీనివాస, లక్ష్మీ బాలాజీ ఆయిల్‌పామ్ కంపెనీల ప్రతినిధులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.


నేడు మండల సర్వసభ్య సమావేశం

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్యసమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

ముగిసిన మండల స్థాయి క్రీడాపోటీలు


రేగిడి: పనసలవలసలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు


రాజాం సిటీ: ఎంపికైన వాలీబాల్ జట్టుతో పీడీలు, తదితరులు


సంతకవిటి: హైజంప్ చేస్తున్న విద్యార్థిని

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ సెలక్షన్లు రెండో రోజు గురువారంతో ముగిశాయి. అండర్ -14, 17 విభాగం బాలబాలికలకు విడివిడిగా ఎంపికలు చేపట్టారు. ఖోఖో, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, కబడ్డీ, లాంగ్‌జంప్, రన్నింగ్ విభాగాల్లో ఈ ఎంపికలు చేపట్టామని మండల స్పోర్ట్స్ ఇన్‌చార్జి సీమల రేణుకాదేవి తెలిపారు. ఈ నెల 15న జరగనున్న డివిజన్ స్థాయి పోటీల్లో ఎంపికైన జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు.హెచ్‌ఎం బి.పద్మావతి, పీడీలు పి.అజయ్, త్రినాథరావు, సంతోషిణి, సుజాత, దుర్గారావు, బంగారయ్య, శ్రీనివాసరావు, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి మండలంలో..

సంతకవిటి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్ సెలక్షన్లు గురువారం ముగిసాయి. ఖోఖో, కబడ్డీ,అథ్లెటిక్స్, వాలీబాల్, తదితర క్రీడాంశాల్లో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి రోజు బుధవారం 220 మంది బాలురు, రెండో రోజు గురువారం 160 మంది బాలికలు పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులు పాలకొండలో జరగబోయే డివిజనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ బుజంగరావు తెలిపారు.

ఉత్సాహంగా...

రేగిడి: మండలంలోని పనసలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండలస్థాయి బాలికల క్రీడా పోటీలు నిర్వహించారు. అండర్ -14, 17 విభాగంలో వివిధ క్రీడల్లో నిర్వహించిన ఈ పోటీల్లో 350 మంది విద్యార్థినులు పాల్గొన్నారని ఎంఈఓ ఎం.వి. ప్రసాదరావు తెలిపారు.హెచ్‌ఎం బి.సునీత, ఎంఈఓ-2 ఎరకయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు

బాడంగి: మండలంలోని చినభీమవరం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ పీఓ ఎం.వరహాలమ్మ గురువారం తనిఖీలు చేశారు. కేంద్రంలో పౌష్టికాహార పదార్థాల స్టాక్ ,రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహార కిట్లను గర్భిణులు, బాలింతలకు సక్రమంగా పంపిణీ చేయాలని అంగన్‌వాడీ కార్యకర్త శారదాకుమారికి సూచించారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు.

ప్రభుత్వ స్థలాల్లో వ్యాపారాలు సరికాదు

బొబ్బిలి: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ,బొబ్బిలి వీణల విక్రయ కేంద్ర స్థలాలను కొంతమంది స్వార్థపరులు తమ ప్రభుత్వ పలుకుబడితో లీజుకు రాయించుకుని వ్యాపారాలు నిర్వహిస్తామంటే ఊరుకునేదిలేదని ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తదితరులు అన్నారు. పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఐటీఐ కాలనీ ఎదురుగా ప్రభుత్వ స్థలంలో వీణలకేంద్రం కోసం భవనం నిర్మించారన్నారు.దానితో పాటు వెనుక ఉన్న స్థలాన్ని బీజేపీ నాయకుడు చదును చేసి రిసార్టు నిర్మించడానికి ప్రయత్నించడం దారుణమన్నారు. ప్రభుత్వం నుంచి ఈ స్థలాన్ని 20ఏళ్లకు లీజుకు తీసుకున్నట్టు ఆయన చెబుతున్నారని, బొబ్బిలిలో ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు లేవని, సమస్యను దృష్టిలోఉంచుకుని ఈ లీజును రద్దు చేయాలన్నారు.

విద్యార్థులకు ఉపయోగపడే నిర్మాణాలకు ఈ స్థలాన్ని వినియోగించాలని కోరారు. లేకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు రోహిత్,నాని,కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాబ్ మేళాలో 132 మంది ఎంపిక



ఇంటర్వ్యూలకు వచ్చిన యువతకు సూచనలు చేస్తున్న ప్రిన్సిపాల్ భాస్కరరావు

రాజాం సిటీ: స్థానిక ఐటీఐలో గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 412 మంది యువతీ,యువకులు జాబ్ మేళాకు హాజరు కాగా, వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేసి 132 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారని ఐటీఐ ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన అవకాశాలను సద్వినియోగించుకుని, ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు.

వినియోగదారులకు చేరువుగా ఎంఆర్‌ఎఫ్ సేవలు



నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎంఆర్‌ఎఫ్ రీజనల్ మేనేజర్ రేణువర్గీస్

రాజాం సిటీ: వినియోగదారులకు ఎంఆర్‌ఎఫ్ సేవలు మరింత చేరువచేసేందుకు చర్యలు చేపట్టామని ఎంఆర్‌ఎఫ్ రీజనల్ మేనేజర్ రేణువర్గీస్ తెలిపారు. రాజాంలోని శ్రీకాకుళం రోడ్డులో ఎంఆర్‌ఎఫ్ కంపెనీకి చెందిన సాయి బాలాజీ టైర్ల షోరూమ్‌ను గురువారం ప్రారంభించారు. సేల్స్ మేనేజర్ విష్ణుసాయి సనా, బ్రాంచ్ నిర్వాహకులు మజ్జి అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్ రైటింగ్ పుస్తకాల వితరణ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ వెంకటేష్,తదితరులు


రాజాం: మండలంలోని మారేడుబాక ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, శిర్లు లక్ష్మణరావు సంయుక్తంగా రూ. 30 వేలు విలువ చేసే హ్యాండ్ రైటింగ్ పుస్తకాలు వితరణ చేశారు. హెచ్‌ఎం గౌరీ శంకర్, వైస్ ఎంపీపీ వెంకటేష్ గురువారం వీటిని విద్యార్థులకు పంపిణీ చేశారు.పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కోళ్ల పరిశ్రమ ఏర్పాటును నిలిపివేయాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

రామభద్రపురం: మండలంలోని కొండకెంగువ గ్రామ సమీపంలో లేయర్ కోళ్ల పరిశ్రమ ఏర్పాటు ను ఆపాలని కొండకెంగువ గ్రామానికి చెందిన పలువురు యువకులు తహసీల్దార్ అజా రఫీజాన్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామా నికి అతి దగ్గర లో కోళ్ల పరిశ్రమ ఏర్పాటు చేయడం వల్ల ఆ పరిశ్రమ నుంచి వచ్చే దుర్వాసన తో పాటు వ్యర్థాలతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఈపరిశ్రమ ఏర్పాటు ను రెవెన్యూ అధికారులు నిలిపి వేయకుంటే ఆందోళనలు చేపడతామని చెప్పారు. యువకులు బెల్లాన శివకృష్ణ, కంచుపల్లి షణ్ముకరావు, కోట ప్రసాద్, చెల్లూరి నాగరాజు, పెదపల్లి సన్యాసిరావు, అంపోలు శివ, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే ఆనందం




దత్తవిజయానంద తీర్థ స్వామీజీకి పూర్ణ కళశాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు(ఇన్‌సెట్‌లో) భక్తుల నుద్దేశించి మాట్లాడుతున్న స్వామీజీ

రేగిడి: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆనంద, ఆహ్లాదం, ప్రశాంతత కలుగుతుందని, గ్రామాల్లో సత్సంగాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో ఐకమత్యం పెరుగుతుందని మైసూరుకు చెందిన దత్త విజయానంద తీర్థస్వామీజీ అన్నారు. రేగిడిలోని దత్తపీఠాన్ని గురువారం ఆయన సందర్శించారు. స్వామీజీకి గ్రామమహిళలు పూర్ణకళశాలతో స్వాగతం పలికారు. అనంతరం భక్తులనుద్దేశించి స్వామీజీ మాట్లాడుతూ ఇంట్లో కూర్చొని లేనిపోని మాట్లాడుకునేకంటే దేవాలయాల్లో సత్సంగాలు నిర్వహించుకోవడం మంచిదన్నారు. రోజూ నగరసంకీర్తన చేయాలని సూచించారు.దత్తపీఠం నిర్వాహకులు కిమిడి సూరపునాయుడు, కిమిడి రవికుమార్‌ను అభినందించారు.